# మేడే-అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమం నేడు ఎదుర్కొంటున్న సవాళ్ళు

**మేడే** పండుగ కాదు, వేడుక ఎంత మాత్రమూ కాదు; అది ప్రపంచ కార్మికుల పోరాట దీక్షా దినం. పని గంటల తగ్గింపు కోసం అమెరికాలోని చికాగో కార్మికులు రక్తం చిందించి ఎర్రజెండాను కార్మిక పతాకగా అందించిన దినం. తదనంతర కాలపు ప్రపంచ కార్మిక వర్గానికి స్ఫూర్తి నింపి మరెన్నో పోరాటాలకు ప్రేరణనిచ్చిన మహత్తర దినం. ప్రపంచ దేశాల కార్మిక వర్గం తమ కార్యకలాపాలను సమీక్ష చేసుకొని తమ విముక్తి కోసం, సామ్యవాద వ్యవస్థ స్థాపన కోసం సాగించే సమరాన్ని మరింత పకడ్బందీగా ముందుకు తీసుకుపోయేందుకు దీక్ష తీసుకునే ప్రతిజ్ఞా దినం మేడే.

మేడే స్ఫూర్తితో శాస్త్రీయ సామ్యవాద (సైంటిఫిక్ సోషలిజం) మార్గదర్శకత్వంలో కార్మికులు ఒక వర్గంగా సంఘటితపడి, తమ వర్గ రాజకీయాలపై ఆధారపడి కార్మికవర్గ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకోగలిగారు. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా దోపిడీ పీడనలను అంతమొందించి కోట్లాది మంది ప్రజానీకం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, ఆత్మగౌరవం, ఆనందంతో జీవించగల సామ్యవాద వ్యవస్థను స్థాపించగలిగారు.

రష్యా-చైనాలు, తూర్పు యూరప్‌లోని అనేక దేశాలలో సామ్యవాద వ్యవస్థలు వెలసి లక్షల సంవత్సరాల మానవజాతి చరిత్ర చవిచూడని మహత్తర విజయాలను సాధించి ప్రపంచ ప్రజల పోరాటాలకు దిక్సూచిగా నిలిచాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ఆయా దేశాల కమ్యూనిస్టు పార్టీలలో రివిజనిజం పైచేయి సాధించి ప్రపంచ మానవాళి పురోగమనాన్ని వెనుకపట్టుకు గురి చేసింది. సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా అమెరికా ప్రపంచంపై పెత్తనం చేస్తూ ఆధిపత్యం కోసం ప్రయత్నాలను తీవ్రం చేసింది. దోపిడీ దురాక్రమణ యుద్ధాలను సాగిస్తూ ఉంది.



ఇదే అదనుగా భావజాలపరంగా పెట్టుబడిదారీ విధానమే ఏకైక ప్రత్యామ్నాయమంటూ పెట్టుబడిదారీ మేధావులు ప్రచారాన్ని తీవ్రం చేశారు. మార్క్సిజంపై వివిధ రూపాలలో దొంగ దెబ్బలను, దాడులను ముమ్మరం చేశారు. కార్మిక, ప్రజా పోరాటాలపై నిర్బంధం అణిచివేతలను, సైనిక బలగాలను ప్రయోగించి రక్తపుటేరులు పారించారు. అయినా చరిత్ర గమనాన్ని వెనక్కు మళ్లించడం వాళ్లకు సాధ్యం కాలేదు, కాదు కూడా. మార్క్స్ ద్విశతజయంతి సందర్భంగా ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో ప్రజానీకం మేధావులు కమ్యూనిస్టు ప్రణాళికను, మార్క్స్ క్యాపిటల్ గ్రంథాన్ని పునర్దర్శనం చేయడం మార్క్సిజం ప్రాసంగికతను చెప్పకనే చెబుతోంది.

ఇక పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయమే లేదన్న పెట్టుబడిదారులు, దాని అంతర్ గర్భంలో నుంచే సంక్షోభం తలెత్తి కకావికలమవుతున్నారు. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాలు ఈ తమ సంక్షోభ భారాన్ని ప్రధానంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల కార్మికవర్గం పైన, శ్రమజీవులయిన ప్రజానీకంపై మోపుతూ వారి బ్రతుకులను మరింత దుర్భరం చేస్తున్నాయి. నయా ఉదారవాద విధానాలు, సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల వంటి చిట్కాలేవీ పెట్టుబడిదారీ సంక్షోభాన్ని గట్టెక్కించ లేకపోగా, సంక్షోభం నుండి మరో సంక్షోభంలోకి దోవ తీస్తున్నాయి. ఈ పరిస్థితులు తిరిగి కార్మిక ప్రజానీకపు అసంతృప్తి ఆగ్రహాలను రగిలించి, వారి వర్గ పోరాటాలను పదునెక్కిస్తున్నాయి.

కార్మికవర్గ ప్రజానీకపు ఆగ్రహావేశాలు సంఘటిత రూపం తీసుకోకుండా ఉండేందుకు, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు వివిధ రూపాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్బంధం అణచివేతలతో పాటు, కార్మిక యూనియన్లను ఏర్పడనీయకుండా వివిధ చట్టపరమైన ఆంక్షలు పెడుతున్నారు; యూనియన్ నాయకత్వాలను నయానా భయానా తమ చెప్పు చేతల్లో ఉంచు కుంటూ, తమ వేలితో తమ కన్నునే పొడుచుకునేట్లు చేసే, కుటిల ఎత్తుగడలతో కార్మిక వర్గాన్ని ఘోరంగా వంచిస్తున్నారు.

మరోవైపున వేతనాల కోత, పని పరిస్థితులు దిగజారటం, పని గంటల పెంపు, పరిశ్రమల మూసివేతలు, లాకౌట్లు, తొలగింపులు (రిట్రెంచ్‌మెంట్లు) వంటి పెరుగుతున్న పెట్టుబడిదారీ దోపిడీ రూపాలు అనివార్యంగా కార్మికులను పోరాట మార్గంలోకి నడుపుతున్నాయి.ప్రపంచ పెట్టుబడిదారీ వర్గాన్ని ఒకనాడు 'కమ్యూనిజం' అనే భూతం వెంటాడితే; నేడు కార్మికోద్యమాన్ని సంస్కరణవాదం, రాజీవాదం, అణకువతత్వం అనే

భూతాలు తమ గుప్పెట్లో బంధించాయి. బూర్జువా వర్గానికి దాసోహమనే ఈ భావదారిద్ర్య పరిస్థితుల్లో కూడా కార్మికులు పోరాటాలు చేస్తున్నారు, ఉద్యుక్తులవుతున్నారు.

అమెరికాలో డిఫైన్డ్ పెన్షన్ విధానాలను 90 శాతం రద్దు చేశారు. స్పెయిన్‌లో ఉద్యోగ విరమణ వయస్సును 65 సంవత్సరాలకు, జర్మనీ, బ్రిటన్లలో 67 సంవత్సరాలకు పెంచారు; జర్మనీలో 70 సంవత్సరాలకు పెంచే ఆలోచన చేస్తున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కార్మికులకు ఉద్యోగులకు చెల్లించాల్సిన డబ్బును తక్షణం చెల్లించకుండా, ఆ డబ్బునంతా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మూలధనంగా మళ్ళిస్తున్నారు. ఉద్యోగ విరమణ వయసును పెంచుకుంటూ పోవడం, మరోవైపున నిరుద్యోగం మరింతగా పెరగటానికి కారణమై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. ఈ పెన్షన్ సంస్కరణలను నిరసిస్తూ, పెన్షన్ అర్హత పొందాలంటే 43 సంవత్సరాల కనీస సర్వీసు ఉండాలనే నిబంధనను వ్యతిరేకిస్తూ గత సంవత్సరం మేడే నాడు 10 లక్షల మంది కార్మిక ప్రజానీకం పారిస్ వీధుల్లోకి వచ్చారు. ఇంతే కాదు; వేతనాల పెంపు కోసం, మెరుగైన పని పరిస్థితుల కోసం అమెరికా, బ్రిటన్, జర్మనీ, దక్షిణ కొరియా, ఇటలీ వంటి వివిధ ప్రపంచ దేశాల కార్మిక ప్రజానీకం భారీ సంఖ్యలో కదులుతున్నారు. స్పెయిన్‌లో 24 శాతానికి చేరిన నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటూ, ద్రవ్యోల్బణం పెరిగిపోవటాన్ని నిరసిస్తూ కార్మికవర్గం కదిలి వచ్చి వీధి పోరాటాలు సాగిస్తోంది. యూరపు అంతటా రైతాంగం ఆందోళనలు సాగిస్తూ వున్నారు. ఇది మంచి సూచకమే, ఇది కార్మిక-కర్షక మైత్రికి దారితీస్తుంది.

సామ్రాజ్యవాదుల లాభాపేక్ష, మార్కెట్ల పంపిణీలో పోటీలనేవి మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలకు దారితీసిన తరహాలోనే, నేడు అమెరికా అగ్రరాజ్య ప్రేరేపితమైన యుద్ధాలు కార్మికవర్గంపై, ప్రపంచ ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా బూచిని చూపి ఉక్రెయిన్‌తో పాటు, నాటో సభ్య దేశాలకు అమెరికా భారీగా ఆయుధాలను సరఫరా చేస్తోంది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని; ఇరాన్‌పై దాడులను అమెరికా ఎగదోస్తోంది. తద్వారా మధ్యప్రాచ్యంలో అనిశ్చితిని, అశాంతిని నెలకొల్పి, ఉద్రిక్తతలను పెంచి, నిలబెడుతూ ఆయా దేశాలకు పెద్దఎత్తున ఆయుధాలను విక్రయించడం ద్వారా అమెరికా తన సంక్షోభ భారం నుండి బయట పడాలని చూస్తోంది, కానీ అది అసాధ్యం. సామ్రాజ్యవాదులు సాగిస్తున్న యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ కార్మిక వర్గమూ, ప్రపంచవ్యాపిత పీడిత ప్రజానీకమూ 'ప్రజాస్వామ్యం-సోషలిజం-శాంతి' అనే నినాదాలతో ఐక్యశక్తిగా నిలబడతారు; సామ్రాజ్యవాదుల ఆటలను సాగనివ్వరు.

కార్మికులు తమ దైనందిన సమస్యలపై అనేక ఆందోళనలు, పోరాటాలు సాగించటాన్ని తమ కర్తవ్యం నెరవేర్చినట్లుగా చెప్పుకోవడం గురించి ఆనాడే కారల్ మార్క్స్ **'వేతనం-ఖరీదు-లాభం'** పై చేసిన రచనలో ఇలా విశ్లేషించారు: 'ఈ దైనందిన (రోజువారీ) పోరాటాలు ఎలా పరిణమిస్తాయనే విషయంపై కార్మికవర్గం మరీ అతిశయాలకు పోకూడదు. తాము పోరాడుతున్నది ఫలితాలకు వ్యతిరేకంగా మాత్రమేనని; వాటికి గల కారణాలకు వ్యతిరేకంగా కాదని వారు మరచిపోకూడదు. తాము పరిస్థితుల్ని దిగజార్చకుండా నిరోధిస్తున్నామేగానీ, అసలు మార్గాన్ని మార్చడం లేదనీ; వ్యాధి యొక్క ఉగ్రతను (తీవ్రత) తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామేగానీ, వ్యాధిని నిర్మూలించడం లేదనీ వారు గమనించాలి' అని హెచ్చరిస్తూ, కార్మిక వర్గం తమ అసలైన కర్తవ్యాన్ని చేబూనాలని కర్తవ్య బోధ చేశారు. 'న్యాయమైన పనికి న్యాయమైన వేతనం' అనే మితవాద నినాదం స్థానంలో వారు తమ పతాకం మీద 'జీతాల పద్ధతి రద్దు కావాలి,' (వేతన బానిసత్వం రద్దు కావాలి) అనే విప్లవకర నినాదాన్ని చిత్రించుకోవాలని, ఆ దిశగా ఉద్యమాలను రాజకీయంగా విద్యావంతం చేయాలని పిలుపునిచ్చారు.

మన దేశంలోని కార్మిక వర్గం కూడా దీనికి మినహాయింపుగా లేదు, వ్యవస్థీకృత కేంద్ర ట్రేడ్ యూనియన్లు, రివిజనిస్టు ట్రేడ్ యూనియన్లు-కార్మికుల పోరాటాలను ఆర్థిక డిమాండ్ల మేరకే పరిమితం చేస్తున్నాయి. కార్మికులు గతంలో పోరాడి సాధించుకున్న ఎన్నో హక్కులు ప్రత్యేకించి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు తర్వాత కోల్పోతున్నప్పటికీ దీనిపై ప్రభావశీలమైన ఐక్య ఉద్యమాలు నిర్వహించ లేకపోవటం ఒక ప్రధాన బలహీనతగా ఉంది.

మన దేశంలో కార్మిక వర్గాన్ని-వారి తక్షణ ప్రధాన కర్తవ్యమైన ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం అందించే చారిత్రక వర్గంగా, ఆ బాధ్యతలను అందుకునే విధంగా సమాయత్తం చేయడంలో జరుగుతున్న లోపాన్ని సవరించుకోవాలి. సమాజంలో పీడిత ప్రజల నాయకునిగా కార్మిక వర్గాన్ని తీర్చిదిద్దాలి. వ్యవసాయ రంగంలోని శ్రమజీవులతో సహా అసంఘటిత రంగంలోని శ్రామికుల సమస్యలను ఛాంపియన్ చేసే విధంగా వారు రూపొందాలి.

అయితే కార్మిక వర్గం తనకు తానే రాజకీయవంతం కాలేదు. కార్మిక వర్గానికి బయట నుండి రాజకీయాలు అందించాలి. కార్మికవర్గ అగ్రగామి దళమైన కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కర్తవ్యం-కార్మిక వర్గంలో రాజకీయ కృషి సాగించడమే. కార్మిక వర్గం-ట్రేడ్ యూనియన్ రాజకీయ కృషి, విప్లవ పార్టీ రాజకీయ కృషి ఒక్కటేననే దృక్పథం నుంచి బయటపడాలి. కార్మికవర్గాన్ని నూతన ప్రజాతంత్ర విప్లవం వైపు సంసిద్ధం చేయాలి. ప్రజాతంత్ర విప్లవ నాయకుడిగా కార్మికవర్గం తయారు కావాలి. ఇదే నేటి మేడే ఇస్తున్న సందేశం.

**(2024 మే 'క్లాస్ స్ట్రగుల్' సంపాదకీయానికి అనువాదం)**

*****